సాక్షి
వికారాబాద్

సోమవారం । 29 । మే । 2023



సాగుబడికి కొత్త ఒరవడి
వ్యవసాయశాఖ సాగులో వినూత్న పద్ధతులకు శ్రీకారం చుట్టింది. పంట దిగుబడుల పెంపే లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. 8లో▸



మహనీయుడు అంబేడ్కర్
అంబేడ్కర్ మహనీయుడని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీ మాజీమంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 8లో▸



ధాన్యం.. రైతుల దైన్యం
చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తెస్తే.. అధికారుల అలసత్వంతో ఇబ్బందులు తప్పడంలేదు. 9లో▸

రెండో విడతకు రెడీ

ఎట్టకేలకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐదేళ్ల క్రితం కార్యక్రమం ప్రారంభించిన సర్కారు కొద్ది మందికే పంపిణీ చేసి మిగతా వారికి అప్పుడూ ఇప్పుడూ అంటూ జాప్యం చేస్తూ వచ్చిన విషయం విదితమే. తాజాగా రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని ప్రకటించి అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ దశాబ్ది సంబరాల్లో భాగంగా వచ్చే నెల 9న పంపిణీ ప్రారంభిస్తామని స్వయంగా కలెక్టర్ ప్రకటించారు. దీంతో యాదవులు, గొల్ల కురుమల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.



గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు
- 9న ముహూర్తం
- పశుసంవర్ధక శాఖ అధికారుల కసరత్తు
- జిల్లాలో 311 సొసైటీలు
- రెండో విడత మంజూరు లక్ష్యం 11,073 యూనిట్లు

వికారాబాద్: యాదవులు, గొల్లకురుమలను ఆర్థికంగా ప్రగతి పథంలో పయనింపజేసేందుకు ప్రభుత్వం గొర్రెల పంపిణీకి 2017లో శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని రెండు విడతలుగా అమలు చేయాలని నిర్ణయించిన సర్కారు మొదటి విడతలో 50 శాతం రెండో విడతలో 50 శాతం యూనిట్ల గొర్రెలు పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. సొసైటీలుగా ఏర్పడి సభ్యులుగా నమోదైన 18 సంవత్సరాలు నిండిన గొల్ల కురుమలకు ఒక యూనిట్ చొప్పున పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించి అమలును ఆరంభించింది. జూన్ 9న మరో రెండు పథకాలు ప్రారంభించనున్నారు. కుల వృత్తుల వారికి ఆర్థిక ప్రేరణ కింద రూ.లక్ష ఆర్థిక సాయం, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ఈ రెండు పథకాలు ఆరంభించనున్నారు.

కసరత్తు ప్రారంభం

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో పశు సంవర్ధక శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ట్రాన్స్‌పోర్టు చేసేందుకు టెండర్లు పిలిచే ప్రక్రియపై చర్చించినట్టు వెటర్నరీ అధికారులు తెలిపారు. గతంలో గొర్రెల కాపరులు తమ వాటా డబ్బులు 25 శాతం డీడీల రూపంలో ఇచ్చే వారు. ప్రస్తుతం డీడీలు కాకుండా తమ వాటా డబ్బులు నేరుగా కలెక్టర్ ఖాతాలో జమ చేసేలా విధివిధానాలు రూపొందించారు. ప్రభుత్వ వాటా 75 శాతం నిధులు కలెక్టర్ ఖాతాలో జమచేయటంతో ద్వారా కొనుగోలు చేసి గొల్లకురుమలకు అందజేయాలని ప్రభుత్వం విధానాలు రూపొందించింది.

యూనిట్ విలువ పెంపు

జిల్లాలో మొత్తం 311 గొర్రెల కాపరుల సహకార సంఘాలున్నాయి. ఇందులో 22,025 మంది సభ్యులున్నారు. 2017–18లో లక్ష్యం 10,954 యూనిట్లు కాగా, 2018 జూన్ చివరినాటికి 10,078 యూనిట్లను మాత్రమే పంపిణీచేశారు. ఇంకా మొదటి విడతకు సంబంధించి 876 యూనిట్లను అందజేయాల్సి ఉంది. లబ్ధిదారులు చెల్లించిన డీడీలు 490 పశుసంవర్ధక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రెండో విడత గొర్రెల పంపిణీ లక్ష్యం జిల్లాలో 11,071 యూనిట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఒక యూనిట్‌పై ప్రభుత్వం 75శాతం సబ్సిడీని అందజేస్తుంది. యూనిట్ విలువ గతంలో రూ.1.25 లక్షలు కాగా, ప్రస్తుతం విలువ రూ. 1.75 లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారు వాటా రూ.43,250 పోను మిగతా సొమ్మును ప్రభుత్వం భరిస్తుంది. ప్రభుత్వం ప్రతి యూనిట్‌కు సబ్సిడీ కింద తనవాటాగా రూ.131,750 చెల్లిస్తున్నది. ఏదైనా కారణం చేత గొర్రె చనిపోతే పరిహారం ఇవ్వడానికి గాను ప్రతి గొర్రెకు కొనుగోలు సమయంలోనే ప్రభుత్వమే బీమా చేయిస్తుంది. ప్రీమియం డబ్బులు సైతం యూనిట్ విలువలోనే జత చేయడంతో ప్రత్యేకంగా బీమాకు చెల్లించాల్సి అవసరంలేదు. ఒక్కో యూనిట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలును అందజేస్తున్నారు.

పకడ్బందీగా చర్యలు



రెండో విడత గొర్రెల పంపిణీతో పాటు కులవృత్తుల వారికి ఆర్థిక ప్రేరణ పథకం, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఈ మూడు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నాం. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా వీటికి శ్రీకారం చుడుతున్నాం. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

దశాబ్ది అదరాలి.. అభివృద్ధి చాటాలి

- సమన్వయంతో ఉత్సవాలను చేపట్టాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. జూన్ 2 నుంచి 22 వ తేదీ వరకు ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవవాలను పురస్కరించుకొని ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆయా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, వివిధ వర్గాల ప్రజలకు చేరూర్చిన లబ్ధి, సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా చూపించేందుకు ప్రయత్నించాలన్నారు. కూడళ్లను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు, అపశ్రుతులు చోటు చేసుకోకుండా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులు అందరూ ఈ వేడుకల్లో పాల్గొనేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సైతం అందంగా తీర్చిదిద్దాలన్నారు. రైతు వేదికల్లో రైతు దినోత్సవాలు జరపాలని, ప్రతి సమావేశాల్లో కనీసం వెయ్యి మంది రైతులు పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోని ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు, తోరణాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్నారు. అన్ని మండలాల్లో , మున్సిపాలిటీల్లో ఎంపీడీఓలు, కమిషనర్లు ప్రధాన పాత్ర వహించాలన్నారు. ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

జిప్సం ఫ్యాక్టరీతో తాగునీరు కలుషితం

గుంతబాసుపల్లి వాసుల్లో ఆందోళన



ఖాసీం వాడుకలో వ్యర్థ జాలాలను చూపిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: గుంతబాసుపల్లి శివారులోని జిప్సం ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థ జలాల వల్ల తాగునీరు, సాగునీరు కలుషితమవుతోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన యువకులు దస్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో వ్యర్థ జలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిప్సం ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ జలాలు యథేచ్ఛగా బయటకు వదులుతున్నారని అన్నారు. వ్యర్థ జాలాలు ఖాసీం అలీ వాడుకకు చేరి దుర్వాసన వస్తోందన్నారు. ఈ వాడుకలో కలుషితమైన నీరు చేరి తెప్పలాగ తేలియాడుతోందని చెప్పారు. ఈ నీటిని పశువులు తాగితే మృత్యువాత పడే ప్రమాదం ఉందని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థ జాలాలు భూమిలో ఇంకడంతో బోరు మోటార్ల ద్వారా సాగునీరు ఎర్రగా వస్తున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి జిప్సం ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని గుంతబాసుపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.



తెప్పలుగా తేలుతున్న వ్యర్థ జలాలు

న్యూస్‌రీల్

సురవరం రచనలతో సామాజిక చైతన్యం



మాట్లాడుతున్న కవులు

అనంతగిరి: సురవరం ప్రతాప్‌రెడ్డి తన రచనలతో సామాజిక చైతన్యానికి కృషి చేశారని అనంత సాహితి సాంస్కృతిక వేదిక జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రచారి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో సురవరం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం తెలంగాణ వరమని, తొలి తెలుగు వైతాళికుడని అన్నారు. కవిగా, రచయితగా, పరిశోధకునిగా పత్రికా సంపాదకునిగా ఆయన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కవులు బందెప్పగౌడ్, విశ్వనాథం, కొండా వెంకటవీరారెడ్డి, దివాకరశాస్త్రి, రాజు, నవీన్, నర్సింహులు, లాల్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్ల రమేశ్‌కు విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న వడ్ల రమేశ్

షాద్‌నగర్: పట్టణానికి చెందిన కళాకారుడు వడ్ల రమేశ్ విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డును అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డులను అందజేశారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి ఆచార్య చేతుల మీదుగా వడ్ల రమేశ్ అందుకున్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకోవడంపై పలువురు ఆయనను అభినందించారు.

'నీట్'పై బాలికలకు ఉచిత అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే ఎలా విజయం సాధించాలనే అంశంపై బాలికలకు వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్ కుమార్ తెలిపారు. ఆదివారం నీట్‌పై ఉచిత అవగాహన సదస్సు పోస్టర్‌ను చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేకంగా బాలికల కోసం ఉచిత హాస్టల్ వసతితో మొదటి 120 మందికి తరగతులు నిర్వహిస్తామన్నారు. నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, మెంటార్‌షిప్, టెస్ట్ సిరీస్ తదితర నూతన ప్రిపరేషన్ విధానం ద్వారా నీట్‌లో విజయం ఎలా సాధించాలో వివరిస్తామన్నారు. నీట్ ర్యాంకర్లు, సీనియర్ అధ్యాపకులు, విషయ నిపుణులు పాల్గొనే ఈ సదస్సులో విలువైన సూచనలు సలహాలు అందజేస్తామన్నారు. డాక్టర్లు కావడమే లక్ష్యంగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన బాలికలు సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుకు వచ్చేవారు ముందస్తుగా 85229 58575, 70322 64910 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.



సుల్తాన్‌నగర్‌లో క్విజ్ పోటీలపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలి

- వచ్చే నెల 17లోపు పేర్లు నమోదు చేసుకోండి
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాజీవ్‌గాంధీ క్విజ్ పోటీల్లో యువత పాల్గొనాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రగడ్డపల్లి, సుల్తాన్‌పూర్, రంగంపల్లి, రూప్‌ఖాన్‌పేట్, సాండేపూర్‌తండా, ఇబ్రహీంపూర్, హర్యానాయక్‌తండా, గడిసింగాపూర్ గ్రామాల్లో యూత్ డిక్లరేషన్‌లో భాగంగా ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. యువతకు ఆన్‌లైన్ పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 18న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 17లోపు క్విజ్‌లో పాల్గొనే వారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 16 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులన్నారు. ఈ క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్లు, తదితర బహుమతులను అందిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం 2 లక్షల ఉద్యోగులను భర్తీ చేస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేక కోర్సులను ఉచితంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని యువత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కాంగ్రెస్ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారి శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలుకూరు గురుకులంలో ఫిజిక్స్ ఒక పోస్టు, నార్సింగి గురుకులంలో ఫిజిక్స్ ఒక పోస్టు, గౌలిదొడ్డి గురుకులంలో గణితం 2 పోస్టులు, ఫిజిక్స్ 2 పోస్టులు, కెమిస్ట్రీ 3 పోస్టులు, జువాలజీ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పోస్టుగాడ్యుయేషన్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐఐటీ, నీట్ పరీక్షల శిక్షణలో పదేళ్ల అనుభవం, ప్రశ్నపత్రాలు తయారు చేసే అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు కనీసం రెండేళ్లపాటు పని చేయడానికి ఒప్పందపత్రం రాసివ్వాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 3న గౌలిదొడ్డి గురుకులంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

మొక్కల పండుగకు సన్నద్ధం

- పచ్చదనం వెల్లివిరిసేలా చర్యలు
- తొమ్మిదో విడత హరితహారానికి ప్రత్యేక కార్యాచరణ



కొడంగల్ రూరల్: అప్పాయిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి

కొడంగల్ రూరల్/దౌల్తాబాద్: మొక్కల పండుగకు రంగం సిద్ధమైంది. తొమ్మిదో విడత హరితహారం ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ప్రతి గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం కోసం అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. జిల్లాలోని నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉండగా అన్ని శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడం, ఖాళీ, ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. కొడంగల్ మండలం 26 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో లక్షా 17వేల మొక్కలను పెంచుతున్నారు. ప్రతి గ్రామంలోని నర్సరీలో 4,500 మొక్కల చొప్పున పెంపకం చేపట్టారు. నర్సరీల్లో పూలు, పండ్లు మొక్కలతోపాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. కూలీలను నియమించి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి మొక్కలు తట్టుకునేలా గ్రీన్‌నెట్ వేస్తున్నారు. సమయానికి అనుగుణంగా మొక్కలకు నీరు పెడుతున్నారు.

పచ్చదనానికి ప్రాధాన్యం

గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియాలి.. పట్టణాలన్నీ మొక్కలతో కళ కళలాడాలనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అనుగుణంగా ఏటా మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు అధికారులు ప్రాధాన్యతనిస్తున్నారు. పలు ప్రాంతాల్లో మొక్కలు పచ్చగా, ఏపుగా పెరిగి ఆ ప్రాంతానికి కొత్త అందాన్ని ఇవ్వడంతోపాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ఉపయోగపడుతున్నాయి.

ప్రతి ఇంటికీ మూడు మొక్కలు

ఈ దఫా హరితహారంలో ప్రతి ఇంటికీ మూడు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది మామిడి, కరివేపాకు, పూలమొక్కలు వంటి మొక్కలను అందజేయనున్నారు. అధికారులు ఇళ్ల వివరాలను సేకరించి సిద్ధం చేశారు.

ఏపుగా పెరిగాయి..

ఓ వైపు ఎండల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ నర్సరీల్లో మొక్కలకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. దీంతో చాలా నర్సరీల్లోని మొక్కలు ఏపుగా పెరిగి పచ్చగా కళకళలాడుతున్నాయి. నిత్యం అధికారులు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సూచనలు చేయడంతో పల్లెప్రకృతి బృహత్ వనాల్లో మొక్కలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి.

సిద్ధం చేశాం



జూన్ రెండో వారంలో మొక్కలు నాటేందుకు అన్ని పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశాం. ఎప్పటికప్పుడు కార్యదర్శులను అందుబాటులో ఉంచుతూ రక్షణ చర్యలు చేపట్టాం. దౌల్తాబాద్ మండలంలో మొత్తం 2లక్షల మొక్కలు రెడీగా ఉన్నాయి.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

క్రీడలకు ప్రాధాన్యం

- బ్రీవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నగేష్
- రాష్ట్రస్థాయి సీఎం కప్ షురూ

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని బ్రీవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నగేష్ అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్–2023 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువు, క్రీడలు రెండుకళ్లలాంటివని పేర్కొన్నారు. వాలీబాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్ విభాగాల్లో 33 జిల్లాల నుంచి మొత్తం 1,334 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగురోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ యాదవ్, అంతర్జాతీయ క్రీడాకారులు డీసీపీ వేణుగోపాల్, మద్ది మహేందర్ రెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే..

వాలీబాల్ (పురుషుల విభాగం): రంగారెడ్డి– వనపర్తి జిల్లా జట్లు తలపడగా రంగారెడ్డి జిల్లా విజేతగా నిలిచింది. కొమురంభీం– సిద్దిపేట జిల్లాల్లో కొమురంభీం జట్టు విజేతగా, మహబూబ్‌నగర్–భూపాలపల్లిలో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా, నిజామాబాద్–భువనగిరి జిల్లా జట్లు తలపడగా నిజామాబాద్ జట్టు విజేతగా, వికారాబాద్–ఖమ్మం జట్టు తలపడగా ఖమ్మం జిల్లా విజేతగా నిలిచింది.

మహిళల విభాగం: ఆసిఫాబాద్–నల్లగొండ జట్లు తలపడగా నల్లగొండ విజేతగా, నిజామాబాద్–భూపాలపల్లి జిల్లాల్లో నిజామాబాద్ జట్టు విజేతగా, వరంగల్– సూర్యాపేట జిల్లాలు తలపడగా వరంగల్ జట్టు గెలుపొందింది. హైదరాబాద్– హనుమకొండ జిల్లాల్లో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది.



తలపడుతున్న వాలీబాల్ జట్లు

కబడ్డీ (మహిళల విభాగం): నల్లగొండ–జగిత్యాల జట్లు తలపడగా నల్లగొండ విజేతగా, సూర్యాపేట–సంగారెడ్డిలో సూర్యాపేట విజేతగా, జనగాం–కరీంనగర్ జట్లలో జనగాం విజేతగా, రంగారెడ్డి–గద్వాలలో రంగారెడ్డి జట్టు విజేతగా, హనుమకొండ–సిద్దిపేట జిల్లాల్లో సిద్దిపేట జిల్లా విజేతగా, ఖమ్మం–మెదక్ జిల్లాల్లో మెదక్ జట్టు విజయం సాధించింది.

క్లుప్తంగా

ఎస్‌డీఎఫ్‌ నిధులతో గ్రామాలకు మహర్దశ

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



రాఘవపూర్‌ బస్‌షెల్టర్‌లో ఎమ్మెల్యే తదితరులు

యాలాల: ప్రత్యేక అభివృద్ధి నిధులతో గ్రామాలకు మహర్దశ కలగనుందని ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఎస్‌డీఎఫ్‌ నిధులతో చేపట్టే కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. ముందుగా బషీర్‌మియాతండాలో అంబేడ్కర్‌ విగ్రహానికి సర్పంచ్‌ మిత్రు నాయక్‌తో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తాండూరు పట్టణంలో నిర్మించిన నూతన గృహప్రవేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను అందించారు. ప్రత్యేక అభివృద్ధి నిధులతో రాఘవపూర్‌ గ్రామంలో నిర్మించిన బస్‌ షెల్టర్‌లో కాసేపు కూర్చుని గ్రామస్తులతో ముచ్చటించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్‌ విఠల్‌ నాయక్‌, వైస్‌ ఎంపీపీ రమేశ్‌, కోఆప్షన్‌ సభ్యుడు అక్బర్‌బాబా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల రవాణా అరికట్టేందుకు నాకాబందీ



రైలులో సోదా చేస్తున్న పోలీసులు

అనంతగిరి: నకిలీ పత్తి విత్తనాల రవాణా అరికట్టేందుకు జిల్లాలో నాకాబందీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాకాబందీ చేపట్టారు. మండల కేంద్రాల్లోని ప్రధాన వీధులు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వానాకాలం సాగు సీజన్‌ వస్తున్నందున నకిలీ విత్తనాలు, ఎరువుల రవాణా, విక్రయాలను అరికట్టేందుకే నాకాబందీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 1,515 వాహనాలను సోదా చేశామని, అందులో 15 వాహనాలను సీజ్‌ చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు.

కిడ్నాప్‌ చేశారా.. ఇన్సూరెన్స్‌ కోసమా..?

మంటల్లో దగ్ధమైన కారు



కొందుర్గు: గుర్తు తెలియని ఓ కారు దగ్ధమైంది. ఈ ఘటన జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. జిల్లా పరిధిలోని పెద్దఎల్కిచర్ల , వికారాబాద్‌ జిల్లా కులకచర్ల మండలం ముజాయిత్‌పూర్‌ గ్రామాల మధ్య దట్టమైన అడవి ఉంది. పెద్దఎల్కిచర్ల నుంచి ముజాయిత్‌పూర్‌ వెళ్లే మార్గం ఈ అడవి మధ్య నుంచే ఉంటుంది. ఆదివారం ఉదయం పెట్రోలింగ్‌ విధుల్లో ఉన్న అజహర్‌ అడవిలోని కల్వర్టు పక్కన కారు దగ్ధమవుతున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సక్రమ్‌ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి ఓ కారు పెద్దఎల్కిచర్ల మీదుగా ముజాయిత్‌పూర్‌ వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎవరినైనా కిడ్నాప్‌ చేశారా..? ఇన్సూరెన్స్‌ డబ్బుల కోసం తగులబెట్టారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కారు చేస్‌ నెంబర్‌ ఆధారంగా పరిశీలించగా అఖిలేష్‌రెడ్డి పేరున రిజిస్ట్రేషన్‌ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాగుబడికి కొత్త ఒరవడి

భూమి లక్షణాలు, వాతావరణ పరిస్థితులు, సాగునీటి వసతికి అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకు ముందస్తుగా అవగాహన కల్పించి వినూత్న పద్ధతుల్లో సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

వ్యవసాయ రంగంలో మార్పులు

- వినూత్న పద్ధతులకు శ్రీకారం చుట్టిన అధికారులు

షాబాద్‌: వ్యవసాయశాఖ సాగులో వినూత్న పద్ధతులకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ, నేల ఆరోగ్యం మెరుగుపర్చి, పంట దిగుబడి పెంచుతూ సుస్థిర వ్యవసాయం లక్ష్యంగా అడుగులు వేసేందుకు సిద్ధమైంది. ఈ వానాకాలం నుంచే నూతన పద్ధతులు అమలు చేసేందుకు నిర్ణయించింది. రైతులను పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వైపు ప్రోత్సహించడం, నేలలో వృథాగా పోతున్న భాస్వరాన్ని మొక్కలకు అందించే బ్యాక్టీరియాను వాడడం, ఎరువులు ఒకేసారి కాకుండా పలు దఫాలుగా వినియోగించి అధిక దిగుబడులు సాధించడం, సుస్థిర వ్యవసాయ కోసం సమీకృత పోషకాల నిర్వహణ, వరి సాగును తగ్గించి పత్తి, కంది పంటలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను ఈ వానాకాలంలో వ్యవసాయ శాఖ నుంచి అమలు చేయనున్నారు. ఈ వినూత్న పద్ధతులపై క్షేత్రస్థాయిలో రైతు వేదికల్లో సదస్సులు నిర్వహించి రైతులకు వానాకాలం ప్రత్యేక ప్రణాళికపై వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వరి విత్తనాలు నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం, పాస్పరస్‌ సోలుబుల్సింగ్‌ బ్యాక్టీరియా వినియోగం, ఒకరైతు కనీసం అర ఎకరంలోనైనా భాస్వరం మొక్కలు అందించే బ్యాక్టీరియా వాడేలా ప్రోత్సహించడం, పచ్చిరొట్ట ఎరువు సాగు, పలు దఫాలుగా యూరియా వాడేలా ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి చూస్తారు. పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్షేత్ర ప్రదర్శన విధులు నిర్వహించాల్సి ఉంటుంది.



ముద్దెంగూడలో నూతన విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్‌)

దశలవారీగా యూరియా వాడకం

యూరియాను ఎక్కువ మోతాదులో ఒకేసారి వేయడంతో పంట ఏపుగా పెరుగుతుందనేది రైతుల అపోహ. యూరియాను (నత్రజని) పంటకు ఒకేసారి వేయకుండా పలు దఫాలుగా వేయడం ద్వారా ఉపయోగం ఉంటుంది. ఈ అంశాన్ని సైతం వ్యవసాయ ప్రణాళికలో చేర్చారు. గ్రామాల్లో ప్రదర్శన క్షేత్రాలు ఎంపిక చేసి రైతులచే అమలు చేయించడం ద్వారా ఎరువుల వినియోగంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తారు. అధిక దిగుబడి సాధించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

వరిలో వెదజల్లే పద్ధతి

కూలీల కొరతను అధిగమించేందుకు వరిలో నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగులో ప్రోత్సహించనున్నారు. ఈ పద్ధతిలో వరి సాగు చేయడం ద్వారా ఖర్చు తగ్గనుంది. కూలీలతో పని ఉండదు. వేసవిలో మొదలయ్యే వర్షాలను సద్వినియోగం చేసుకోవచ్చు. సకాలంలో వరి విత్తుకోవచ్చు. ఈ పద్ధతిలో వారం నుంచి పది రోజుల ముందుగానే పంట కోతకు వస్తుంది. రెండో పంటను ముందుగా సాగు చేసుకోవచ్చు. 25 నుంచి 30శాతం నీటి సంరక్షణ, ఎకరాకు రూ.7నుంచి రూ.8వేల వరకు ఖర్చు ఆదా అవుతుంది.

బ్యాక్టీరియా వినియోగం

సాగు ఖర్చు తగ్గించడంలో నేలలో వృథాగాపోతున్న భాస్వరాన్ని మొక్కలకు అందించి, నేలభౌతిక లక్షణాల పునరుద్ధరణకు వ్యవసాయ శాఖ బ్యాక్టీరియా వినియోగాన్ని ముందుకు తీసుకువచ్చింది. పాస్పరస్‌ సోలుబుల్సింగ్‌ బ్యాక్టీరియా బహిరంగ మార్కెట్‌లో సులువుగా లభిస్తుంది. పంట ఎదుగుదలకు రైతులు డీఏపీ, కాంప్లెక్స్‌ ఎరువులు వాడతారు. భాస్వరాన్ని కరిగించి పంటకు అందించే సహజ సామర్థ్యం కలిగి ఉంటుంది. పాస్పరస్‌ సోలుబుల్సింగ్‌ బ్యాక్టీరియాను వర్తింపజేయడం ద్వారా ఒక హెక్టార్‌కు ఒక డీఏపీ బస్తా ఎరువును ప్రభావితం చేయవచ్చు. ఈ అంశంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించనున్నారు.

పచ్చిరొట్ట ఎరువులను ప్రోత్సహించడం

నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువులను ప్రోత్సహించడం ఈ ఏడాది వానాకాలం ప్రణాళికలో ముఖ్య అంశం. విచ్చలవిడిగా వాడుతున్న రసాయనిక ఎరువులతో నేల ఆరోగ్యం దెబ్బతింటుంది. నేలను కాపాడేందుకు పెద్ద ఎత్తున పచ్చిరొట్ట ఎరువులను ప్రోత్సహించాలని లక్ష్యంగా వ్యవసాయశాఖ కార్యాచరణను అమలు చేయనుంది. సేంద్రియ పదార్థం మట్టిని జోడించబడుతుంది.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

వరి పంట సాగును తగ్గించడం ద్వారా కంది, పత్తి సాగును ప్రోత్సహించడం వానాకాలం ప్రణాళికలో రూపొందించారు. మార్కెట్‌లో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు లాభదాయకమైన కంది, పత్తి సాగు పెంపునకు రైతులను ప్రోత్సహించనున్నారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేందుకు ప్రదర్శన క్షేత్రాల నిర్వహణ, పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

అవగాహన కల్పించాలి



వ్యవసాయంలో పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరిగేందుకు నూతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీనివల్ల కల్తీలేని ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చు. భూసారం పెరుగుతుంది.

– రాపోల్‌ నర్సింహులు, రైతు, మల్లారెడ్డిగూడ

రైతుకు మేలు



రైతులు పెట్టుబడిని తగ్గించి నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలనే లక్ష్యంతో వినూత్న వ్యవసాయ పద్ధతులను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గ్రామాల్లో రైతులకు నూతన వ్యవసాయ విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. పచ్చిరొట్ట విత్తనాలను రాయితీతో అందించేందుకు సిద్ధంగా ఉంచాం. రైతులు, వ్యవసాయశాఖ అధికారులు సూచనలు, సలహాలు పాటిస్తూ అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే మరింత ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

మహనీయుడు అంబేడ్కర్‌

ఘనంగా విగ్రహావిష్కరణ

ధారూరు: అంబేడ్కర్‌ మహనీయుడని ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌, మాజీ మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి అన్నారు. ఆదివారం వారు మండల కేంద్రంలో తాండూర్‌–హైదరాబాద్‌ ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్‌ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీల మండల అధ్యక్షులు రాజునాయక్‌, విజయభాస్కర్‌రెడ్డి, అంబేడ్కర్‌ సంఘం నాయకులు కె.నర్సింహులు, మహేశ్‌, టి.నర్సింహులు, బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సంతోశ్‌కుమార్‌, మహ్మద్‌ బాబాఖాన్‌, వెంకటయ్య, ఆనంద్‌, బి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళి అర్పిస్తున్న ప్రసాద్‌కుమార్‌

సమస్యల పరిష్కారానికే ‘పల్లెబాట’



అల్లాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ‘పల్లెబాట’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పల్లెబాటలో భాగంగా ఆయన ఆదివారం అల్లాపూర్‌, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్‌, పటేల్‌ చెరువుతండా, దాస్యనాయక్‌తండా, బోట్యానాయక్‌తండా, పీరంపల్లి, కామునిపల్లిలో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి వెళ్లి సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్‌ నాయక్‌, పార్టీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవాలతో జీవన పోరాటం

- బహుదూరపు బాటసారులు.. పాలమూరు గొర్రెల కాపరులు
- ఏడాదిలో ఎనిమిది నెలల పాటు సంచారం
- బీమా లేక ఆర్థికంగా నష్టపోతున్న వైనం



బంట్వారం మీదుగా మందలతో వెళ్తున్న పాలమూరు కాపరులు

బంట్వారం: పాలమూరు గొర్రెల కాపరులు బహుదూరపు బాటసారులు. ఏడాదిలో ఎనిమిది నెలల పాటు గొల్ల, కుర్మలు గొర్రెల మందలతో మేత కోసం వివిధ జిల్లాల్లో తిరుగుతూ జీవన పోరాటం చేస్తుంటారు. వీరు బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ఎక్కువగా కనిపిస్తుంటారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా ఒకప్పుడు కరువుతో కొట్టుమిట్టాడుతుండేది. మూగజీవాలను బ్రతికించుకునేందుకు గొర్రెల కాపరులు నానా తంటాలు పడేవారు. ఈ క్రమంలోనే వారు అప్పటి నుంచి జీవాల మేత కోసం సుదూర ప్రయాణం మొదలు పెట్టారు. ప్రతీ సంవత్సరం దీపావళిఅనంతరంఇళ్లను వీడి బృందాలుగా ఏర్పడి మందలతో బయలుదేరుతుంటారు. నేటికీ అదే పద్ధతిలో పర్యటన కొనసాగిస్తున్నారు.

తరచూ ప్రమాదాలు

రోడ్డు మార్గాన సాగుతున్న వీరి ప్రయాణంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈఘటనలో జీవాలు చనిపోతుంటాయి. బీమా లేకపోవడంతో కాపరులు నష్టపోతున్నారు. పశు సంవర్ధక శాఖ అవగాహన కల్పించక పోవడంతో గొర్రెలకాపరులు తమ జీవాలకు ఇన్సూరెన్స్‌ చేయించడం లేదు.

నెలల తరబడి..

నెలల తరబడి ఇంటికి దూరంగా.. వందలాది కిలోమీటర్లు తిరుగుతుంటారు. ఎక్కడ చీకటి పడితే అక్కడే పొలాల్లో నిద్రిస్తుంటారు. ప్రమాదకరమైన పయనంలో సరైన భోజనం, తాగునీరు లేక ఇబ్బంది పడుతుంటారు. మృగశిర కార్తె వరకు బయటే కాలం గడుపుతుంటారు. వర్షాలు మొదలు కాగానే మందలతో పాలమూరుకు తిరుగు పయనమవుతారు. ఇదిలా ఉండగా.. గొర్రెల కాపరులను ‘సాక్షి’ పలకరించగా.. ఇది మా కుల వృత్తి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వదిలేదు. ఇదే మా బతుకు దెరువని కాపరులు చెబుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా పోటీలు



కే-11 జట్టుకు చెక్కుతో పాటు ట్రోఫీ అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌రెడ్డి

పరిగి: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు బీఎంఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహించామని డీసీసీబీ చైర్మన్‌ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో నెల రోజులుగా నిర్వహించిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్‌ మ్యాచ్‌లో అక్రమ్‌ ఏజీ, కే 11 జట్లు తలపడ్డాయి. గెలుపొందిన కే 11 జట్టుకు రూ.2లక్షల చెక్కు, రన్నరప్‌ జట్టుకు రూ.లక్ష చెక్కు అందజేసి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహబంధాలు బలపడతాయన్నారు. క్రీడాకారులకు తన సహకారం ఎల్లవేలలా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు షోహేబ్‌, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నాగరాజు, నరేశ్‌, యాదయ్యగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం విషయంలో వివాదం

మహిళ బలవన్మరణం

తాండూరురూరల్‌: ఇంటి స్థలం విషయంలో చోటు చేసుకున్న వివాదంలో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని జినుగుర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన నానాపురం మంజుల(38), నాగప్ప భార్యాభర్తలు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా వారి దాయాదులైన నానాపురం గోపాల్‌, సుజాత దంపతులతో ఇంటి విషయంలో గొడవలు జరుగుతన్నాయి. ఆదివారం జరిగిన గొడవలో మంజులను దూషించడంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుంది. స్థానికులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



నర్సింలు(ఫైల్‌)

షాద్‌నగర్‌రూరల్‌: మండల పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులో నూర్‌ కళాశాల వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఫరూఖ్‌ నగర్‌ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన అమీర్‌పేట చెన్నయ్యగౌడ్‌, మార్గని నర్సింలు(65) ద్విచక్రవాహనం పై శనివారం రాత్రి కమ్మదనం గ్రామానికి వెళ్తున్నారు. నూర్‌ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నర్సింలు శనివారం అర్ధరాత్రి మృతి చెందాడని.. చెన్నయ్యగౌడ్‌ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పెళ్లి రోజే విషాదం



సంజయ్‌ జాడకోసం గాలిస్తున్న ఫైర్‌ సిబ్బంది, పోలీసులు

- కోనేరులో స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతు
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



సంజయ్‌ (ఫైల్‌)

కద్తాల్‌: పెళ్లి రోజున కుటుంబంతో దైవదర్శనానికి వెళ్లారు. బంధువులతో కలిసి కోనేరులో ఈత కొడుతున్న వ్యక్తి ఒక్కసారిగా నీటమునిగి గల్లంతయ్యాడు. ఈ విషాదకర ఘటన ఆదివారం మైసిగండి శివరామాలయం కోనేరులో చోటు చేసుకుంది. పోలీసులు గజఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటిపడడంతో సోమవారం ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందంతో గాలింపు చర్యలు చేపట్టనున్నారు. పోలీసులు స్థానికులు తెలిపిన ప్రకారం.. నగరంలోని శాలిబండ ప్రాంతానికి చెందిన సంజయ్‌(38) పెళ్లిరోజు కావడంతో ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మైసిగండి మైసమ్మ తల్లి దర్శనానికి వచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు మైసిగండి శివరామాలయాల ఆవరణలో ఉన్న కోనేరు వద్దకు వెళ్లారు. బంధువులతో కలిసి ఈత కొడుతున్న క్రమంలో సంజయ్‌ ఒక్కసారి నీటమునిగి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, మహేశ్వరం అగ్నిమాపక సిబ్బందికి ఘటనాస్థలికి చేరుకుని గజఈతగాళ్లతో కలిసి గంటల తరబడి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లభించలేదు. చీకటిపడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. సోమవారం ఉదయం తిరిగి చేపడుతామని పోలీసు అధికారులు చెప్పారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందాన్ని రప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కళ్ల ముందే సంజయ్‌ నీట మునిగి కన్పించకుండా పోవడంతో భార్య ప్రియ, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మైసిగండి శివాలయ రామాలయాల ఆవరణలో కోనేరులో ప్రతీ ఏడాది ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నా నిర్వాహకులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కంచె ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 14 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్‌
- 4 కార్లు, 6 బైక్‌లు, 13 సెల్‌ఫోన్లు, రూ.1.38లక్షల నగదు స్వాధీనం



పోలీసుల దాడిలో పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్లు

చేవెళ్ల: గుట్టుచప్పుడుకాకుండా పేకాడుతున్న 14 మందిని శనివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. గ్రామ సమీపంలోని మల్కాపూర్‌ రోడ్డులోని ఓ వెంచర్‌ వద్ద వాచ్‌మెన్‌ రూంలో పేకాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు స్థానిక పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సమయంలో అక్కడ 14మంది పేకాడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 1లక్ష 38వేల 650రూపాయల నగదు, 13 సెల్‌ఫోన్లు, నాలుగు కార్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో చేవెళ్లకు చెందిన ఎం.అనంతరాములు, ఎం.శ్రీనివాస్‌, ఎస్‌.కృష్ణారెడ్డి, కె.రాంచంద్రయ్య, కె.దుర్గాప్రసాద్‌, జి.నర్సింహ, ఎ.ప్రశాంత్‌రెడ్డి, జయసింహారెడ్డి, ఖానాపూర్‌కు చెందిన సి.వెంకట్‌, వై.రవీందర్‌, దామరగిద్దకు చెందిన పి.మల్లేశ్‌, సన్‌సిటీకి చెందిన కె.శివరాజ్‌, కిషన్‌బాగ్‌కు చెందిన అబ్దుల్‌ ముజీబ్‌, గొల్లగూడకు చెందిన ఎం.నర్సింహ ఉన్నారు. వీరిని సోమవారం రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాజేంద్రనగర్‌: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్‌ పీఎస్‌ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆరాంఘర్‌ నుంచి అత్తాపూర్‌ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో పీవీ నర్సింహరావు ఎక్స్‌ప్రెస్‌వే 280 పిల్లర్‌ వద్ద రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాదారుడు తన వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. మహిళ వివరాలు లభించకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్‌ పోలీసులను గానీ ఉస్మానియా మార్చురీ సిబ్బందిని గానీ సంప్రదించాలని పోలీసులు కోరారు.